www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

బుధవారం
23.09.2026



మీవి, తెలంగాణవి

ఫ్లాష్ ఫ్లాష్!

2 లో

తెలుగు రాష్ట్రాల్లో ఆకస్మిక వరదల ముప్పు

- బయటకు రావద్దని హెచ్చరికలు
- ఉప్పొంగనున్న వాగులు, వంకలు
- సరిహద్దుల్లో సహాయక బృందాలు
- రెండు రోజులు భారీ వర్షా లు
- ఎనిమిది జిల్లాలకు రెడ్ అలర్ట్
- ముమ్మరంగా ముందస్తు చర్యలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాబోయే 24 నుంచి 48 గంటల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా కుంభవృష్టి కురిసే అవకాశ ముండటంతో పాటు ఆకస్మిక వరదలు ముంచెత్తే ప్రమాదముందని వాతావరణ కేంద్రం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ఏపీలోని తీరప్రాంతాలు, తెలంగాణలోని సరిహద్దు జిల్లాల్లో వాగులు, వంకలు ఉప్పొంగే ప్రమాదం ఉండటంతో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తక్షణ సహాయక చర్యలకు సిద్ధం కావాలని ప్రభుత్వాలు ఆదేశించాయి.

కలంజ్యోతి బ్యూరో





ఉమ్మడి ఆదిలాబాద్‌లో యూనివర్సిటీ మాటేమిటి?

3 లో

- దశాబ్దాలుగా నలుగుతున్న ప్రతిపాదన
- గత పాలకుల రాజకీయ జోక్యంతో నిధులు వెనక్కి
- సీఎం హమీ కార్యరూపం దాల్చేనా?

”జ్ఞాన సరస్వతి కొలువైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నత విద్య విద్యార్థులకు కలగానే మిగిలిపోతోంది. దశాబ్దాలుగా యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం కాగా, రాజకీయ జోక్యం, నేతల అవగాహనారాహిత్యంతో గతంలో మంజూరైన రూసా నిధులు సైతం వెనక్కి వెళ్లిపోయాయి. గిరిజన విశ్వవిద్యాలయం ఇతర ప్రాంతానికి తరలిపోవడం, సరిహద్దు యూనివర్సిటీల పరిధి మార్పులతో జిల్లా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బాసర ట్రిపుల్ ఐటీ వేదికగా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఎప్పటికి కార్యరూపం దాల్చుతుందోనని జిల్లా విద్యావంతులు, విద్యార్థి లోకం ఆశగా ఎదురుచూస్తోంది.

కలంజ్యోతి, నిర్మల్



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
బుధవారం 23.09.2026
2
www.kalamjyothi.com

ఏపీ, తెలంగాణకు ఫ్లాష్ ఫ్లడ్!



కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 22) : వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఆకస్మిక మార్పుల కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలుచోట్ల ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఏపీలోని తొమ్మిది జిల్లాలు, తెలంగాణలోని నాలుగు జిల్లాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు.

ఉత్తరాంధ్ర మొదలు కోస్తా వరకు జాగ్రత్తలు పాటించాలి

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉత్తరాంధ్ర మొదలుకొని కోస్తా జిల్లాల వరకు వర్షాల తీవ్రత అత్యధికంగా ఉండనుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకల సమీపంలో నివసించే ప్రజలు తగిన జాగ్రత్తలతో ఉండాలని, ప్రవాహాలు దాటే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని అధికారులు స్పష్టం చేశారు.

తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధం కావాలి

తెలంగాణలోని సరిహద్దు, దక్షిణ జిల్లాలపై ఆకస్మిక వరదల ప్రభావం తీవ్రంగా ఉండనుంది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షాల ధాటికి వాగులు ఉప్పొంగి ప్రవహించే అవకాశం ఉంది. బుధవారం సాయంత్రం లోపే ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చేందుకు ఎక్కువ అస్కారముందని ఐఎండీ వర్గాలు అంచనా వేశాయి. దీంతో అత్యవసర సహాయక బృందాలను రంగంలోకి దించడంతో పాటు, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షా లు కురుస్తాయి

రాష్ట్రాన్ని నల్లని మేఘాలు ఆవహించడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రాగల రెండు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఎనిమిది జిల్లాల్లో అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలి

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల జాబితాలో పెద్దపల్లి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లకు పైగా కుంభవృష్టి వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు కోరారు. అత్యవసర సేవలందించే సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం తగిన ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



ఘనంగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

జన్మదిన వేడుకలు

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 22) : నిర్మల్ ఎంఎల్ఏ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నలుమూలల నుంచి నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు, విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రజాసేవలో మరింతగా ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలకు భారీగా ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో నిర్మల్‌లో పండుగ వాతావరణం నెలకొంది.



భక్తిభావంతో పరవశించిన జల్లి

ఇరుముడి చిత్ర ప్రదర్శన!

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 22) : శబరిమల అయ్యప్ప స్వామి మాలధారణ విశిష్టత, తండ్రి కూతుళ్ల అనుబంధాన్ని చాటిచెప్పే ఇరుముడి చలనచిత్ర ప్రదర్శన మండలంలోని జల్లి గ్రామంలో భక్తుల గుండెలను కదిలించి విశేషంగా ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక చింతన, యువత సత్సంకల్పం తోడైతే గ్రామమే పుణ్యక్షేత్రమవుతుందని నిరూపిస్తూ విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ చిత్ర ప్రదర్శన అశేష జనవాహిని నడుమ అత్యంత వైభవంగా, విజయవంతంగా ముగిసింది. ఈ మహోత్సవానికి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కళ్లు చెమర్చేలా, మనసు మురిసిపోయేలా సాగిన ఈ చిత్ర ప్రదర్శనను చూసి గ్రామస్తులు భక్తిభావంలో మునిగిపోయారు. పసిపిల్లల నుండి పండు ముసలి వారి వరకు అందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ కార్యక్రమాన్ని ఒక జాతరలా నిర్వహించడం విశేషం.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి వెనుక ఉండి నడిపించిన గ్రామ ప్రముఖులు, పెద్దలైన అంబాల క్రాంతి కుమార్, పోలిశెట్టి చిట్టిబాబు, మహమ్మద్ షాజహాన్, పోలిశెట్టి చిరంజీవికి విఘ్నేశ్వర యూత్ సభ్యులు హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారి అండదండలు, నిరంతర ప్రోత్సాహం వల్లే ఈ భక్తి కార్యక్రమాన్ని ఇంత అద్భుతంగా నిర్వహించగలిగామని యువత కొనియాడారు. తమ పిలుపును అందుకొని కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేసిన జల్లి గ్రామ ప్రజలందరికీ, రాత్రింబవళ్లు శ్రమించిన విఘ్నేశ్వర యూత్ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఒక చెరగని మధుర స్మృతిగా నిలిచిపోతుందని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ రెడ్డి

పోలీస్ కళాబృందం చైతన్య ప్రదర్శనలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 22) : సమాజంలో నెలకొన్న పలు అసాంఘిక కార్యకలాపాలు, నేరాలపై ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా వరంగల్ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చెన్నారావుపేట మండల పరిధిలోని సూరిపల్లి గ్రామంలో ప్రత్యేక సామాజిక అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో పోలీస్ జాగృతి కళాబృందం సభ్యులు ఆటపాటలు, లఘు నాటికలు, మ్యూజిక్ షోల ద్వారా ప్రదర్శించిన సాంస్కృతిక అంశాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనల్లో ముఖ్యంగా గంజాయి, గుట్కా, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలై యువత తమ బంగారు భవిష్యత్తును ఎలా నాశనం చేసుకుంటున్నారో కళాబృందం సభ్యులు కళ్లకు కట్టినట్లు వివరించి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాలు, అపరిచిత లింకులు, ఓటీపీ షేరింగ్ ద్వారా మోసపోకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షుణ్ణంగా వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల గురించి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్స్‌ను ఎలా సంప్రదించాలో వివరించి, మహిళల రక్షణకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను తెలియజేశారు. బాల్య వివాహాల నిరోధం, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యత, కన్న తల్లిదండ్రులను వృద్ధాప్యంలో గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యతలపై హృదయానికి హత్తుకునేలా ప్రదర్శనలు ఇచ్చారు.

సామాజిక బాధ్యత కలిగి ఉండాలి..

ఈ సందర్భంగా చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి, స్థానిక సర్పంచ్, పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై గ్రామస్తులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక పనులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రతకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సాంస్కృతిక కార్యక్రమానికి ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కళాబృందం ఆటపాటలను తిలకించి పోలీసుల చొరవను అభినందించారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
బుధవారం 23.09.2026
www.kalamjyothi.com



గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ ముంపు బాధితులకు సాయం

కలెక్టర్ భవేశ్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 22) : నిర్మల్ జిల్లా కుభీర్ మండలం నిగ్వాలో గడ్డెన్న వాగు ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు సహాయం అందిస్తామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన గ్రామస్తులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ నిలిచిపోయిన విషయాన్ని గుర్తించి, అన్ని రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు. బాధితుల పునరావాసం కోసం కేటాయించాల్సి ఉన్న 26 ఎకరాల భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా సర్వే నంబర్ల భూములను పరిశీలించి, సాంకేతిక, రెవెన్యూ పరమైన చిక్కులను త్వరితగతిన పరిష్కరించి భూ పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ శ్రీదేవి, గ్రామ సర్పంచ్ రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

కలంజ్యోతి, హత్నూర (సెప్టెంబర్ 22) : వినాయక చవితి నవరాత్రుల ముగింపు సందర్భంగా హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామంలో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్నేశ్వరుని నిమజ్జన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక యువత, భక్తుల కోలాహలం నడుమ గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కుమ్మరి బిక్షపతి మాట్లాడుతూ తాము ప్రతి సంవత్సరం విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ బొజ్జ గణపయ్య చల్లని దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, పిల్లాపాపలను ఆయురారోగ్యాలతో కాపాడాలని ఆయన విఘ్నేశ్వరుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో యూనివర్సిటీ మాటేమిటి?



కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 22) : చదువులతల్లి జ్ఞాన సరస్వతిదేవి కొలువైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా పరిశీలనలో ఉన్న యూనివర్సిటీ ఏర్పాటు మంజూరయ్యే దశలో రాజకీయ జోక్యంతో వెనక్కి పోయింది. గత ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్యావకాశాలు బలోపేతం చేయక పోగా ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. శ్యామ్ పిట్రోడా నేతృత్వంలోని జాతీయ విజ్ఞాన కమీషన్ నివేదిక ప్రకారం ప్రతి జిల్లాలో ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటు అవసరమన్నారు. కాని ప్రస్తుతం ఉన్న యూనివర్సిటీల్లో నియామకాలు గత పదేళ్లుగా నిలిచిపోయాయి. సగానికి పైగా ఖాళీలు, అరకొర నిధులతో నెట్టుకొస్తున్నారు. కొత్తగా జిల్లాకో రాష్ట్ర విశ్వవిద్యాలయం ఏర్పాటును పక్కనపెట్టి ప్రైవేటుకు మద్దతు ఇవ్వటంతో ఉన్న తవిద్య భారంగా మారింది. దీంతో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. విశ్వవిద్యాలయం పరిధిలో 200 పైగా కళాశాలలు ఉంటే కొత్త విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్రం సూచించింది. ఇందుకోసం యూజీసీ 'రూసా' పథకం ద్వారా నిధులు కేటాయిస్తామన్నారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో నిర్మల్ లోని విశ్వవిద్యాలయ పీజీ కళాశాలను యూనివర్శిటీగా ఉన్నతీకరించేందుకు అవకాశముందని భావించారు. 2009 లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఇందుకు అంగీకరించింది. 2013 లో రూసా పథకం కింద రూ.55 కోట్ల నిధులను సైతం కేటాయించారు. రాష్ట్ర విభజన అనంతర పరిణామాలతో ఈ ప్రతిపాదన మార్చేందుకు నేతలు యత్నించారు. ఆ సమయంలో మంత్రిగా ఉన్న జోగు రామన్న జోక్యంతో ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశ్వవిద్యాలయ ఏర్పాటుకి నిర్ణయం, కేంద్రం అంగీకరించకపోవడంతో రూసా నిధులు వెనక్కు మళ్ళాయి. గిరిజనులున్న ఈ జిల్లాలో ఉట్నూరు కేంద్రంగా గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించి సర్వే చేసింది. రాజకీయ జోక్యంతో ఉమ్మడి వరంగల్ కు తరలించారు. పిజి కళాశాలను యూనివర్సిటీగా ఉన్నతీకరణ చేస్తారన్న నేతల అపగాహనలేమితో రాష్ట్రానికి మంజూరైన యూనివర్సిటీలు, నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

'పరిధి' మారేదెన్నడు?

ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా తొలుత ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ఉండేది. ఆ తర్వాత వరంగల్లో కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుసంధానం చేశారు. అయితే దూరాభారం, వ్యయప్రయాసల కారణంగా విద్యార్థులు ఆదిలాబాదును తెలంగాణ విశ్వ విద్యాలయం పరిధిలో చేర్చాలని కోరారు. గతంలో తెలంగాణ విశ్వ విద్యాలయం పరిధిలోకి తెచ్చినా మంచిర్యాల వాసులు వ్యతిరేకించారు. ఫలితంగా మూడు నెలల అనంతరం తిరిగి కాకతీయ పరిధిలోకి చేర్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని విద్యార్థుల గోడు పట్టించుకోకుండా జిల్లాను వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలోకి మారుస్తూ ఆదాయ వనరుగా భావిస్తున్నారు. ఇక్కడ ఉన్నత విద్యావంతులు ఉన్నా విశ్వ విద్యాలయాల్లోని ప్రాంతీయ భేదాల కారణంగా జిల్లావాసులకు ఉద్యోగావకాశాలు దక్కడం లేదు.

సీఎం హామీ నెరవేరేనా?

ఇదిలా ఉంటే ఈ ఏడాది ప్రారంభంలో జిల్లాకు వచ్చిన సి ఎం రేవంత్ రెడ్డి బాసర ట్రిపుల్ ఐటీలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని సభాముఖంగా ప్రకటన చేశారు. ఐతే ఈ ప్రకటన కార్యరూపం దాల్చేందుకు విద్యావంతులు, మేధావులు ఎదురు చూస్తున్నారు.

కోళ్ల పరిశ్రమకు అధికారుల నోటీసులు

నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించాలి

కలంజ్యోతి, హత్నూర (సెప్టెంబర్ 22) : నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన పన్నుల రూపంలో ఉన్న ఆదాయానికి గండి కొడుతున్న ఓ కోళ్ల పరిశ్రమకు అధికారులు నోటీసులు జారీ చేశారు. హత్నూర మండల పరిధిలోని కోడిపాక గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఓ కోళ్ల పరిశ్రమ నుంచి నిబంధనల ప్రకారం రూ.4 లక్షలకు పైగా పన్ను రావాల్సి ఉండగా, కేవలం రూ.26 వేలు మాత్రమే చెల్లిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనివల్ల గ్రామ పంచాయతీ ఖజానాకు భారీగా గండి పడి ఆర్థిక నష్టం వాటిల్లుతుండటంతో సంబంధిత కోళ్ల పరిశ్రమకు అధికారులు నోటీసులు అందజేశారు. పంచాయతీ ఆదాయాన్ని దెబ్బతీస్తున్న సదరు పరిశ్రమపై ఉన్న తాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.





కళ్యాణ లక్ష్మీ ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 22) : ఆడబిడ్డల వివాహ సమయంలో తల్లిదండ్రులకు ఎదురయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించి పేద కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పష్టం చేశారు. నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట, నెక్కొండ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్వయంగా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నారావుపేట మండలానికి చెందిన 56 మంది, నెక్కొండ మండలానికి చెందిన 34 మంది కలిపి మొత్తం 90 మంది లబ్ధిదారులకు సుమారు రూ.91 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డ పెళ్లి ప్రతి తల్లిదండ్రికీ జీవితంలో ఓ మధురమైన ఘట్టమని, ఆ సమయంలో పేద కుటుంబాలు అప్పులపాలు కాకుండా ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆడబిడ్డల వివాహ సమయంలో ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సాయం ఎంతో ఊరటనిచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ హరి ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్లు చల్లా శ్రీపాల్ రెడ్డి, ఆవుల శ్రీనివాస్, మాదటి శ్రీనివాస్, భూక్యా గోపాల్ నాయక్, మొగిలి వెంకట్ రెడ్డి, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మండల అధ్యక్షుడు తిరుమల్, చెన్నారావుపేట ఎమ్మార్వో అబిద్ అలీ, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

పడక పంచుకుంటే అవకాశం ఇస్తానన్నారు

కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను, క్యాస్టింగ్ కౌచ్ వేధింపులను బాలీవుడ్ నటి అంకితా లోఖండే తాజాగా బయటపెట్టారు. 19 ఏళ్ల వయసులో ఓ సినిమా ఆడిషన్‌లో ఎంపికయ్యానని కాంట్రాక్ట్ కోసం పిలిచి, నిర్మాతతో పడక పంచుకుంటేనే అవకాశం ఇస్తామని డిమాండ్ చేశారని ఆమె వెల్లడించారు. అయితే ఆ ప్రతిపాదనకు భయపడకుండా నిర్మాతకు కావాల్సింది నటన కాదని, కేవలం పడక పంచుకునే అమ్మాయి మాత్రమేనని, ఆ అమ్మాయిని తాను కాదని ముఖంపైనే చెప్పి బయటకు వచ్చేశానని ఆమె పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇండస్ట్రీలో ఎవరూ తనతో అలాంటి అనుచిత ప్రవర్తన చేయకుండా గట్టిగా నిలబడ్డానని తెలిపారు. ధైర్యంగా స్పందించిన ఆమెకు ప్రస్తుతం నెటిజన్లు పెద్దఎత్తున మద్దతు తెలుపుతున్నారు.